
ప్రజాశక్తి
మంగళవారం 7 ఫిబ్రవరి 2023
విజయనగరం



జిల్లా ఖజానా అధికారిగా అశోక్



అశోక్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా ఖజానా, లెక్కల అధికారిగా రుద్రపాటి అశోక్ సమర్పణ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు జిల్లా ఖజానా అధికారిగా ఉన్న ఎస్ఆర్‌కె గణేష్ అనారోగ్య కారణాలతో సెలవు పెట్టడంతో, ఉమ్మడి జిల్లా ఖజానా అధికారిగా అశోక్ సమర్పణ కుమార్ పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎపిటిఎస్ఎ నాయకులు, ఖజానా కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సహాయ ఖజానా అధికారులు నితిన్, ఆదిత్య, ఎపిటిఎస్ఎ రాష్ట్ర కార్యదర్శి పద్మనాభం, జిల్లా కార్యవర్గ సభ్యులు సరేష్, సంతోషి, రామకృష్ణ, చంద్రశేఖర్, నాగమునిరెడ్డి పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

- కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా
- కనీస వేతనాలు అమలు చేసేవరకూ పోరాటం
- ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకుల హెచ్చరిక

సమస్యల పరిష్కారానికి..

కదంతొక్కిన అంగన్‌వాడీలు



మాట్లాడుతున్న యూనియన్ కార్యదర్శి అనసూయ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కనీస వేతనాలు అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చెయ్యాలని, అంగన్వాడీ కేంద్రాలకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు కదం తొక్కారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ధర్నా చేశారు. ఉదయం 10 గంటలకే వందలాది మంది కార్యకర్తలు కలెక్టరేట్‌కు చేరుకొని ప్రధాన గేటు వద్ద బైఠాయించారు.

ధర్నాను ఉద్దేశించి ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పైడిరాజు, అనసూయ, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శంకరరావు, కె.సురేష్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అనేక సేవలు అందిస్తున్నారన్నారని, కానీ ఆయా కేంద్రాల్లో మౌలిక వసతులు లేవని తెలిపారు. కొన్ని కేంద్రాలలో, అసలు విద్యుత్ సౌకర్యం లేదని, ఉన్న చోట ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని అన్నారు. గత ఐదేళ్లుగా ప్రభుత్వం టిఎ, డిఎలు చెల్లించడం లేదన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ అమలుకు కొన్ని ప్రాజెక్టుల్లో గత 6నెలల నుండి బిల్లులు చెల్లించలేదని, ఫలితంగా అంగన్వాడీలు అప్పులుచేసి లబ్దిదారులకు ఆహారం వండి పెడుతున్నారని అన్నారు. రకరకాల యాప్‌లు తీసుకొచ్చి పనిభారం పెంచారని, కనీస వేతనాలు మాత్రం పెంచడం లేదని అన్నారు. గ్రామాల్లో నెట్ సౌకర్యం ఉండటం లేదని, అయినా ఫేస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు ఒత్తిడి చేయడం తగదని అన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి నిధులు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పనిభారం తగ్గించి వేధింపులు ఆపాలని కోరారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని, ఫేషియల్ యాప్ రద్దు చెయ్యాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చెయ్యాలని, 2017 నుండి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ 5 లక్షలు ఇవ్వాలి సూపర్ వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలని డిమాండ్‌చేశారు. ప్రమోషన్లలో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలన్నారు. 300 జనాబా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సభలను నిషేదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబరు 1ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిఐటియు నాయకులు వి.లక్ష్మి, టివి రమణ, బి.సుధారాణి, ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.



బొల్లింకులపాలెంలో కూల్చివేసిన ఇళ్లు



రెల్లిపేటలో పాఠశాల భవనాన్ని కూల్చివేస్తున్న జెసిబి

నిర్వాసిత గ్రామాల్లో

ఇళ్లు కూల్చివేత

- చెప్పా పెట్టకుండా ఇల్లు కూల్చి వేయడం సరికాదు
- నిర్వాసితుల ఆవేదన
- గ్రామాలకు కరెంట్ కట్ చేసిన అధికారులు

ప్రజాశక్తి- భోగాపురం

ఎయిర్‌పోర్టు నిర్వాసిత గ్రామాలైన బొల్లంకిలపాలెం, రెల్లి పేట, ముడసర్ల పేటలో సోమవారం అధికారులు పాఠశాలలను, ప్రభుత్వ స్థలాలలో ఉన్న భవనాలను తొలగించారు. ఆర్‌డిఒ సూర్యకళ, తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఎయిర్‌పోర్టు అధికారి గిరడ అప్పలనాయుడు ఆధ్వర్యంలో భవనాలతో పాటు ఇళ్లను కూల్చే కార్యక్రమం చేపట్టారు. అలాగే పక్క గ్రామాలకు కరెంట్‌కూడా కట్ చేశారు. నిర్వాసిత కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండిపోయాయని, కొద్ది రోజులు సమయం ఇస్తే నిర్మాణాలు పూర్తి చేసి గ్రామాలను ఖాళీ చేస్తామని బాధితులు చెప్పినప్పటికీ ఇళ్లను కూల్చివేయడం దుర్మార్గమని బాధితులు వాపోయారు. గ్రామాల్లో ప్రజలు లేని సమయాల్లో వచ్చి ఇళ్లను కూల్చి వేస్తామని బెదిరించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. రెల్లి పేటలో బాధితులు నిమ్మకాయల లక్ష్మి, బొల్లింకుల లక్ష్మి మాట్లాడుతూ తమ ఇళ్లకు పరిహారం కూడా ఇవ్వకుండా తమ ఇళ్లను కూల్చివేస్తున్నారని అన్నారు.

మంగళవారం ఉదయం నుంచి పూర్తిస్థాయిలో ఇళ్లను తొలగించే ప్రక్రియ చేపడతామని, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నూతన పాఠశాల భవనాన్ని కూడా ప్రారంభోత్సవం చేస్తామని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. మరడ పాలెంలో కూడా తొలగింపు ప్రక్రియ మంగళవారం ఉంటుందని అధికారులు తెలిపారు.

విద్యుత్తు ఎఇపై దర్యాప్తు

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యుత్తు శాఖ పట్టణ ఎఇ బి.సాంబశివరావుపై సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విజిలెన్స్ సిఐ కె.కృష్ణ, ఎస్ఐ డిడి నాయుడు దర్యాప్తు చేపట్టారు. సాయిశర్వాణీ కాలనీలో వీధి దీపాలకు లైన్ వేసేందుకు ఎఇ లంచం అడుగుతున్నారని ఆ కాలనీవాసి జోగారావు లోకాయుక్తకు ఫిర్యాదుచేశారు. దీంతో జోగారావును వారు విచారించారు. రూ.15 వేలు లంచం డిమాండ్ చేసినట్లు విచారణలో జోగారావు చెప్పారు. అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని వివరించారు. నివేదికను లోకాయుక్తకు అందజేస్తామని విజిలెన్స్ అధికారులు చెప్పారు.

8న గజపతినగరంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-గజపతినగరం

ఈ నెల 8న గజపతినగరంలో నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సిఐ ఎల్.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సర్కిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జిఎంఆర్, జివికె కంపెనీల సౌజన్యంతో సెక్యూరిటీ గార్డ్, హౌస్ కీపింగ్ ఉద్యోగాలకు ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనాలని

పెట్రోల్‌తో రైతుల ఆందోళన



పెట్రోల్ సీసాలతో ఆందోళన చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - భోగాపురం

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాని కోరుతూ పెట్రోలు బాటిల్స్‌తో ఆందోళనకు దిగారు. గత 25 రోజులు నుండి ధాన్యం కొనమంటే అధికారులు తిప్పుతున్నారే తప్ప కొనుగోలు చేయడం లేదని పొలంలో చలిలో ధాన్యం బస్తాలు వద్ద కాపలా ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బాధ ప్రభుత్వానికి పట్టదా అని ప్రశ్నించారు. అధికారులు 100 టన్నులు కొనుగోలు చేస్తామంటున్నారని మిగతా 500 టన్నులు ధాన్యం ఏమి చేసుకోవాలని నిలదీశారు. ప్రభుత్వం కన్నా దళారులే నయమని తక్కువకు తీసుకున్నా వెంటనే డబ్బులు చెల్లించేస్తారని చెప్పారు. దాన్యం కొనుగోలు చేసే దాక ఆందోళన విరమించేది లేదని రైతులు బైటాయించారు. ధాన్యం విక్రయాలు జరగకపోవడంతో చేతిలో చిల్లి గవ్వలేదని, తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక బతుకు భారంగా మారిందని వాపోయారు. రకరకాల పథకాలతో ఇతరులకు డబ్బులు జమ చేస్తున్న ప్రభుత్వానికి కష్టపడి పంటలు పండించిన రైతులు కనిపించకపోవడం సిగ్గుచేటన్నారు. త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలనీ లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిటికి తమ సమస్యను వివరించారు.

మాదక ద్రవ్యాల నివారణకు పటిష్ట ప్రణాళిక

విజయనగరం : మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల విక్రయాలపై నిఘా పెంచాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. జాతీయ బాలల హక్కుల కమిషన్, మాదక ద్రవ్యాల నిరోధక శాఖలు సంయుక్తంగా రూపొందించిన జాయింట్ యాక్షన్ ప్లాన్ అమలుపై సోమవారం తన ఛాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై, పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్గించాలన్నారు. సమావేశంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.సుధీర్, డిఎంహెచ్ఒ ఎస్‌వి రమణకుమారి, ఐసిడిఎస్ పీడీ బి.శాంతకుమారి, ఔషధ నియంత్రణశాఖ ఎడి కె.రజిత, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి పి.రత్నం, బిసి సంక్షేమాధికారి యశోదనరావు పాల్గొన్నారు.

జగనన్నకు చెప్పండి

- అధికారులకు 124 వినతులు
- లాగిన్‌లో వెంటనే చూడాలి : కలెక్టర్



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

తమ సమస్యలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో పలువురు వినతులు అందజేశారు. ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 124 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 79 ఉన్నాయి. పించన్ల కోసం, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై మిగిలిన వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి, జె.సి మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు పద్మావతి, సూర్యనారాయణ, దొర పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ. స్పందన లో అందిన వినతులు పెండింగ్ పెట్టకుండా గడువు లోగా పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు.

ఉగాది నాటికి గృహాలు సిద్ధం చేయాలి

పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం క్రింద నిర్మిస్తున్న గహాలు ఉగాదికి సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ లోపల పెండింగ్ పనులన్నీ వేగంగా జరగాలన్నారు. రెండో శనివారం సెలవు అయినప్పటికీ హౌసింగ్ డే జరపాలని ఆదేశించారు. ప్రత్యేకాధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

జాతర పేరుతో అక్రమ వసూళ్లు ఆపాలి

స్పందనలో మాజీ జెడ్‌పిటిసి సభ్యులు పెదబాబు ఫిర్యాదు

ప్రజాశక్తి - జామి

జామి యల్లారమ్మ జాతర పేరిట లక్షలాది రూపాయలు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బండారు పెదబాబు సోమవారం స్పందనలో కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ యల్లారమ్మ జాతర పేరిట చిల్లర వ్యాపారులు, కాంట్రాక్టర్లు, కిరాణా, చివరికి కూరగాయల వ్యాపారులను కూడా వదలకుండా వసూళ్లకు పాల్పడుతున్నారని చెప్పారు. గ్రామ వాలంటీర్ల సాయంతో గ్రామంలోని ఉద్యోగుల కుటుంబాల నుంచి వసూలు చేస్తున్నారని తెలిపారు. రూ.లక్షలు వసూళ్లు చేసి ఉత్సవ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెబుతున్న నాయకులు, కనీసం పండుగ అనంతరం లెక్కలు కూడా చెప్పడం లేదని ఆరోపించారు. ఖర్చులు పేరుతో దేవాదాయ శాఖ అధికారుల నుంచి ఆలయ ఆదాయంలో లక్షలాది రూపాయలు దౌర్జన్యంగా గుంజుతున్నారని తెలిపారు. అక్రమ వసూళ్లపై సమగ్ర విచారణ చేపట్టి, వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి వెనక్కి ఇప్పించాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థలో ఉన్న నాలుగు ఆలయాలను అభివృద్ధి చేయాలని అధికారులకు వినతి అందజేశారు.

ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో

26న ప్రజ్ఞా వికాస పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

10వ తరగతి విద్యార్థులకు ఈనెల 26న నిర్వహించే ప్రజ్ఞావికాస పరీక్షను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్.వెంకటేష్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెవిఆర్‌కె ఈశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎల్‌బిజి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యారంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ, విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ విద్యారంగం అభివృద్ధి కోసం పోరాటాలు చేయడమే కాకుండా విద్యార్థులను విద్యలో ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులను ప్రోత్సహించేందుకు నిర్వహించే ఈ ప్రజ్ఞా వికాస పరీక్ష పేపర్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పర్యవేక్షణలో తయారు చేశారని తెలిపారు. ఈ పరీక్ష జిల్లాల్లో అన్ని మండల కేంద్రాల్లో 26వ తేదీన ఉదయం 10 గంటలకు జరుగుతుందని, ఎంట్రీ ఫీజు రూ.25 అని తెలిపారు. మొదటి బహుమతి రూ.5000, రెండవ బహుమతి రూ.3000, మూడో బహుమతి రూ.2000 ఉంటుందని తెలిపారు. మండల స్థాయి విజేతలకు మొమెంటోస్, సర్టిఫికేట్‌లు అందజేస్తామని తెలిపారు. పరీక్షల వివరాల కోసం కింది నంబర్లను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు సిహెచ్.రామకృష్ణ, ఎం.హర్ష పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ - 77998 13327, 7589290549
నెల్లిమర్ల-7288849236, 6301007969
ఎస్.కోట - 7995107340, 94924 14763
గణపతినగరం - 8341105362, 760103413,
చీపురుపల్లి -99058 25957, 70384 98735
రాజాం-77290 57149, 63029 78953
బొబ్బిలి- 7013378783, 9642688591
విజయనగరం రూరల్ - 728800 25790, 91331 12254

సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం

బొబ్బిలి కోర్టులో సేవలందించేందుకు గాను స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నియామకానికి అనుభవజ్ఞులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కల్యాణ్ చక్రవర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర హైకోర్టు పరిధిలో సేవలందించిన వారు, ఏదైనా ప్రభుత్వ కార్యాలయంలో గెజిటెడ్ హోదాలో పని చేసి రిటైర్ అయిన వారు, న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో సేవలందించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఫిబ్రవరి 17వ తేదీ లోగా నమూనా ప్రకారం దరఖాస్తుల పూర్తి చేసి జిల్లా కోర్టులో అందజేయాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ.30వేలు గౌరవ వేతనం అందుతుందని తెలిపారు.

సురేఖకు రసాయన శాస్త్రంలో డాక్టరేట్



విసి నుంచి డాక్టరేట్ అందుకుంటున్న సురేఖ

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక తోటపాలెంలోని సత్య డిగ్రీ, పీజీ కళాశాల పూర్వ విద్యార్థి పి.సురేఖకు ఇటీవల ఆంధ్ర యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ వచ్చింది. ఆమె చిత్తూరులో సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్నారు. 'నోవల్ కేటాలిక్ అప్లికేషన్స్ ఆఫ్ కాపర్ ఫైరేట్ నానో పార్టికల్స్ అండ్ ఆప్టికల్ అప్లికేషన్ ఆఫ్ నానో కాంపోజిట్" అనే అంశంపై పరిశోధనలు చేశారు. ఆంధ్ర యూనివర్సిటీ రసాయన శాస్త్ర విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ అయిన డాక్టర్ పాల్ డగ్లస్, డాక్టర్ హిమబిందు గైడెన్స్ లో పరిశోధనలు చేశారు. సురేఖ సత్య కళాశాలలో 2001-03లో ఇంటర్మీడియట్, 2003-6 బిఎస్‌సి చదివారు. ఈ సందర్భంగా ఆమెను కళాశాల కరస్పాండెంట్ బొత్స ఝాన్సీ లక్ష్మి, డైరెక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ ఎంవి సాయి దేవమణి అభినందించారు.



ధర్నా చేస్తున్న సిపిఐ, సిపిఎం, టిడిపి, జనసేన నాయకులు, టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలి

కలెక్టరేట్ వద్ద సిపిఐ ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం కోట

జగనన్న ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న 1 లక్షా 80 వేలను రూ.5 లక్షలకు పెంచాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు తక్షణం అప్పగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద సిపిఐ ఆధ్వర్యాన ధర్నా చేశారు. ధర్నాకు సిపిఎం, టిడిపి, ఆమ్ ఆద్మీ, లోక్‌సత్తా, జనసేన నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు, తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు కె. దయనంద్, లోక్ సత్తా జిల్లా నాయకులు రాజారావు, జనసేన పార్టీ జిల్లా నాయకులు త్యాడ రామకృష్ణ మాట్లాడారు. జగనన్న కాలనీల్లో రోడ్లు, కాలువలు, విద్యుత్తు లైట్లు, మంచినీటి పైపు లైన్లు వేసి కుళాయి కనెక్షన్లు లాంటి మౌళిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు అశోక్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విజయనగరం టౌన్ : వివిధ డివిజన్లలో చేపడుతున్న అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శంకుస్థాపన చేశారు. 30వ డివిజన్లో రూ. 3 లక్షలతోనూ, 34వ డివిజన్లో రూ.6 లక్షలతోను కాలువల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మేయరు విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు కోలగట్ల వీరభద్ర స్వామి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో 30వ డివిజన్ కార్పొరేటర్ ఎన్ని లక్ష్మణరావు, జోనల్ ఇన్‌ఛార్జిలు కోలగట్ల కృష్ణారావు, బొద్దాన అప్పారావు, 34 వ డివిజన్ కార్పొరేటర్ బాలి పైడిరాజు, వైసిపి నాయకులు బాలి ప్రతాప్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు పెట్టుబడులను ఆపాలి

ఎల్ఐసి కార్యాలయం వద్ద కాంగ్రెస్ నిరసన



ఎల్ఐసి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి- విజయనగరం కోట

ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసి, బ్యాంకుల్లో ప్రభుత్వం పెట్టిస్తున్న కార్పొరేట్ బలవంతపు పెట్టుబడులను వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తూ ఎల్ఐసి కార్యాలయం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యాన సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం బడా కార్పొరేట్‌లతో ఎల్ఐసిలో బలవంతపు పెట్టుబడులు పెట్టించి వేల కోట్ల రూపాయలు రుణాలు ఇప్పించి తరువాత ఎగ్గొట్టడం షరా మమూలుగా మారిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను దివాళా తీయించేందుకు కేంద్ర ప్రభుత్వం దుర్మార్గమైన చర్యలు చేపడుతోందన్నారు. పెట్రోల్, డీజిల్‌ను జిఎస్‌టి జాబితాలో చేర్చకుండా బడా బాబుల పక్షాన నిలబడి వేల కోట్లు సంపాదన అర్థించడంలో కీలకపాత్ర పోషిస్తోందన్నారు. రానున్నకాలంలో బిజెపి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బొబ్బిలి టౌన్ అధ్యక్షులు ఎన్. వెంకట్రావు, జిల్లా మైనార్టీ అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్, చీపురుపల్లి నియోజకవర్గ అధ్యక్షులు టి.సూర్యనారాయణ, నెల్లిమర్ల నియోజకవర్గ నాయకులు డి.గురువులు చంద్రశేఖర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఎపిఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయించాలని

కార్పొరేషన్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ముఖ ఆధారిత హాజరు నుంచి కార్మికులను సిబ్బందిని మినహాయించాలని, జీతాలు, హెల్త్ అలవెన్సు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి భాస్కర్ రావు, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు ఎ.జగన్మోహన్‌రావు, బి.రమణ మాట్లాడుతూ పర్మినెంట్ కార్మికులకు జీతాలు, సరెండర్ లీవుల డబ్బులు , కాంట్రాక్ట్ కార్మికులకు మూడు నెలల బకాయి హెల్త్ అలవెన్స్‌లు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో 30 ప్రకారం ఇంజినీరింగ్, వాటర్ సప్లై, కార్మికులకు పనికి తగ్గ వేతనం చెల్లిస్తామని, చెత్త తరలించే డ్రైవర్లకు, పార్కుల్లో పనిచేసే శానిటరీ కార్మికులకు హెల్త్ అలవెన్స్ లు చెల్లిస్తామన్న ప్రభుత్వ హామీ నేటికీ నెరవేరలేదని అన్నారు. మరణించిన రిటైర్డు కార్మికుల బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలని, విలీన ప్రాంత కార్మికులను కార్పొరేషన్ కార్మికులుగా గుర్తించాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18500 జీతం చెల్లించాలని కోరారు. అనంతరం కమిషనర్‌కు వినతి అందజేశారు. ధర్నాలో నాయకులు ఎన్. పైడిరాజు, రజని, కృష్ణ, శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com


పార్టీకి రథసారథులు మీరే

సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-కొత్తవలస

సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులే పార్టీ రథ సారథులని వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, విశాఖ ఎంపి ఎమ్‌వివి సత్యనారాయణ హాజరయ్యారు. ఈసందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ముఖ్యమంత్రి ఆలోచనలను, ఆశయాలను ప్రజలకు వివరించాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయో లేదో చూడాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు తైనాల విజయకుమార్, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు,రాష్ట్ర బి.సి కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, జిసిసి చైర్మన్ శోభా స్వాతిరాణి, శోభా హైమావతి, డిసిసిబి చైర్మన్ వేచలపు వేంకట చినరామునాయుడు , పార్టీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, ఎఎంసి చైర్మన్ మూకల కస్తూరి పాల్గొన్నారు.

పూసపాటిరేగ : సంక్షేమ పథకాలపై వాలంటీర్లతో పాటు, గృహ సారథులు, కన్వీనర్లు వివరించాలని వైసిపి జిల్లా రీజనల్ కో-ఆర్డినటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సిహెచ్ అగ్రహారం లేఅవుట్‌లో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అధ్యక్షతన పూసపాటిరేగ మండల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గృహసారథులకు, కన్వీనర్లకు కిట్లు అందజేసారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారా? లేదా? తెలుసుకోవడానికి ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారన్నారు. గృహ సారదులతో పాటు కన్వీనర్లు ఇంటింటికి వెళ్లి జగనన్న సంక్షేమం గురించి వివరించాలన్నారు. వారు సంతృప్తి చెందితే వారి ఇంటికి జగనన్న స్టిక్కర్ అంటించాలన్నారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనువాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు పెనుమత్స సురేష్ బాబు, ఇందుకూరి రఘురాజు, నియోజకవర్గ పరిశీలకులు అందవరపు సూరిబాబు, నాయకులు కందుల రఘుబాబు, కాకర్లపూడి శ్రీనుబాబు, ఎంపిపిలు మహంతి కళ్యాణి, అంబళ్ళ సుధారాణి, మహంతి జనార్దన్, పుప్పాల లక్ష్మీనారాయణ, పార్టీ అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, చనమల్ల రమణ, చిక్కాల సాంబ, ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, జెడ్‌పిటిసిలు పడాల మంజులత, గదల సన్యాసి నాయుడు, సౌత్ రైల్వే బోర్డ్ సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీరాములనాయుడు, మత్స సత్యనారాయణ, కెవి.సూర్యనారాయణరాజు, మండల కన్వీనర్ మహంతి శ్రీనువాసరావు పాల్గొన్నారు.



కొత్తవలస.. సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి

విజయనగరం టౌన్ : ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల చెంతకు తీసుకెళ్లాలని ఉత్తరాంధ్ర జెసిఎస్ కోఆర్డినేటర్ హర్షవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం సుజాత కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన గృహ సారథులు, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్ల సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో పాటు ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజలకు అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రభుత్వ పాలనపట్ల ప్రతిపక్ష పార్టీలు ఆరోపణలు చేయలేక వాలంటీర్ వ్యవస్థను అడ్డుకునేందుకు కుయుక్తులు పన్నుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల ఏర్పాటుకు రంగం సిద్ధమైనట్లు చెప్పారు. కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనా తీరును, ప్రస్తుత ప్రభుత్వ పాలన తీరును వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో గృహ సారథుల మండల కమిటీ అధ్యక్షుడు మజ్జి అప్పారావు, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, ఎఎంసిమాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి నారాయణ, కెల్ల త్రినాథ్, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో కేర్ ట్రాకర్ మృతి

ప్రజాశక్తి -భామిని



ఏనుగుల దాడిలో మృతి చెందిన లక్ష్మీనారాయణ

మండలంలోని పసుకుడి గ్రామం సమీపాన వంశధార తీరప్రాంతంలో ఏనుగుల దాడిలో లోకుండ లక్ష్మీనారాయణ(25) అనే ఎలిఫెంట్ కేర్ ట్రాకర్ మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి 7.30గంటలకు చోటు చేసుకుంది. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఐ.హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం లోకుండ లక్ష్మీనారాయణ ఐదేళ్లుగా ఎలిఫెంట్ కేర్ ట్రాకర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సెలువుపై వెళ్లిన లక్ష్మీనారాయణ సోమవారం విధుల్లోకి వచ్చాడు. వచ్చిన రోజే సాయంత్రం ఏనుగుల తరలించే క్రమంలో జారిపడిపోయాయి. దీంతో నాలుగు ఏనుగులు ఒకేసారి దాడి చేయడంతో చనిపోయాడని తెలిపారు. మతుడి స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం తిడ్డిమి. గత కొన్ని రోజులుగా 13 మంది ఎలిఫెంట్ కేర్ ట్రాకర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఏనుగుల దాడిలో సహచరుడు చనిపోవడంతో తోటి సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు.

పింఛను రాక నిరాధారమై!

ప్రజాశక్తి-దత్తిరాజేరు



పింఛనుకు నోచుకోని సింహాచలం

74 ఏళ్ల వయసులో కూలి పనులు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్న వృద్ధురాలికి వయోభారంలో ఆసరాగా అందాల్సిన పింఛను అందక, నిరాధారమై బతుకు భారమైంది. మండలంలోని గడసాం గ్రామానికి చెందిన బూడి సింహాచలం(74)కు రెండేళ్లుగా వృద్ధాప్య పింఛను అందడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులను ప్రాథేయపడినా నేటికీ స్పందన కొరవడింది. గతంలో ఆమెకు వృద్ధాప్య పింఛను అందేది. ఆధార్ సిబ్బంది తప్పుడు నమోదు వల్ల అందులో 27 ఏళ్లుగా వయసుగా నమోదైంది. ఏదేమైనా తప్పిదాలను ఎత్తిచూపి పింఛను నిలిపివేసిన అధికారులు.. అదే తప్పిదాన్ని సరిదిద్దడంలో చొరవ చూపడం లేదు. ఆధార్‌లో వయసు తప్పుగా నమోదు కావడంతో వయోభారంలో ఉన్న వందలాది మంది, భర్తను కోల్పోయిన అభాగ్యులు, వికలాంగులు, వృద్ధాప్యంలో ఉన్న వివిధ వృత్తిదారులు పింఛన్లు కోల్పోయిన సమస్యను చాలామంది ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పింఛను మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని పెదమేడపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ జి.సుమంత్ తెలిపారు. జనవరి నెలలో రామభద్రపురం మండలం కొట్టక్కి జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో మెరిట్ స్థానంలో నిలిచారని చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన కె.శ్రావణి, ఎల్.గాయత్రి, టి.యశోద, రమ్యను ఆయన అభినందించారు.

ఫేషియల్ యాప్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - వంగర

విఆర్‌ఎలకు ఫేషియల్ యాప్‌ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షులు యజ్జల అప్పలస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విఆర్‌ఎలకు బయోమెట్రిక్ విధానాన్ని పెడితే సంఘం పోరాట ఫలితంగా ఆ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం విఆర్‌ఎలకు ఫేస్‌యాప్ పెట్టి వృద్ధాప్యంలో ఉన్న విఆర్‌ఎలను అలసటకు గురిచేస్తుందని అన్నారు. ప్రభుత్వం విఆర్‌ఎల పైన చిన్న చూపు చూస్తుందని ఇప్పటికైనా ఫేషియల్ యాప్‌ను రద్దు చేయకపోతే భవిష్యత్ పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

అర్ధరాత్రి రక్తదానం

ప్రజాశక్తి- నెల్లిమర్ల



రక్తదానం చేస్తున్న దుర్గాప్రసాద్

రోడ్డు ప్రమాదంలో గాయపడి విజయనగరం శ్రీసాయిసూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వై. గురయ్యమ్మకు రక్తం అవసరం కావడంతో జరజాపుపేటకు చెందిన యువకుడు అర్ధరాత్రి వెళ్లి రక్తదానం చేశాడు. ఆమెకు ఎబి పాజిటివ్ బ్లడ్ కావాలని నెల్లిమర్ల సాధన యూత్ క్లబ్ అధ్యక్షులు పోలుబోతు దుర్గాప్రసాద్‌కు సమాచారం రావడంతో వెంటనే స్పందించిన ఆయన జరజాపుపేట నుండి కనకల కళ్యాణ్‌ను విజయనగరం పంపించి రాత్రి 12 గంటల సమయంలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేయించారు. రక్తదాతను బాబామెట్ట ఎపికె సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఎండి కలిలుల్లా షరీఫ్, సీనియర్ వైద్యులు డాక్టర్ ఎ.శ్రీధర్, చార్టెడ్ అకౌంటెంట్ ఏ. రవిచంద్ర రెడ్డి, సామాజిక సేవా కార్యకర్త జాకీర్ హుస్సేన్, చేయూత ఫౌండేషన్ అధ్యక్షులు ఎం. రాము, జర్నలిస్ట్ జయరాజు, మధు అభినందించి సత్కరించారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని గుల్లపాడు పంచాయతీ పరిధి కొండల మామిడి వలసలోని సర్వే నెంబరు 49లోని 86 సెంట్లు ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్లపట్టాలిచ్చి ఇల్లు మంజూరు చేయాలని ఆ గ్రామ సర్పంచ్ వియ్యపు లావణ్య చక్రపాణితోపాటు గ్రామస్తులు సోమవారం ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావుకు స్పందనలో అర్జీ చేసుకున్నారు. 1985 నుంచి ఆ స్థలాలలో పేదలు పునాదిరాళ్లు వేసుకున్నారని గ్రామానికి చెందిన మధుసూదనరావు, ఫకీరు మరి కొంతమంది ఆక్రమించుకొని ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. వీరిద్దరూ ఆక్రమించిన స్థలాల్లో మనస్పర్థలు వచ్చి కోర్టును ఆశ్రయించారన్నారు. ఆక్రమించిన స్థలాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని, ఆ ప్రభుత్వ భూమిలో అర్హులైన ఎస్‌టి, బిసి, మైనార్టీ పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు నివేదించి పేదలకు ఇళ్లపట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆర్థిక రంగంలో మహిళల ముందంజ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఆర్థిక రంగంలో మహిళలు ముందంజలో నిలవాలని నాబార్డ్ డిడిఎం నాగార్జున అన్నారు. పిఎంఇజిపి పథకం కింద ఎస్.కోట, జామి మండలాల్లో నడుస్తున్న పలు యూనిట్లను ఆయన పరిశీలించారు. ముందుగా ఎంబ్రాయిడరీ మెషిన్ చూసి వారికి వస్తున్న ఆదాయం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రకాశం మార్కెట్‌లో పేపర్ ప్లేట్ యూనిట్‌ను పరిశీలించారు. ఎడిబి బ్యాంక్ మేనేజర్ సోమశేఖర్ పిఎంఇజిపి యూనిట్స్ ఎక్కువగా గ్రౌండింగ్ చేసి నిరుపేద మహిళలకు ఆర్థిక సహాయం చేయడంతో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి, ఎసి జయశ్రీ, డిపిఎం బంగారమ్మ, ఎపిఎం సురేష్ కుమార్, రెండు మండలాల బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత

ప్రజాశక్తి- గరివిడి

చీపురుపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఇటీవలే కర్లాం పంచాయతీ, మోదుగులపేట అంగన్వాడీ ఆయాగా నియమితులైన ఆ గ్రామానికి చెందిన ఆగురు మణికి నియామిక పత్రాన్ని సోమవారం వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు చేతులు మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో కరిమజ్జి శ్రీనివాసరావు నాయుడు, బాణాన శ్రీను, గుర్ల జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, సమగ్ర శిశు అభివృద్ధి పథకపు అధికారి ఎన్. రాజేశ్వరీ, సూపర్‌వైజర్ కృష్ణవేణి, రెడ్డి నీల, మీసాల సీతారాం, ప్రభాత్ కుమార్, మహంతి మురళీ, మొండేటి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టి ధ్రువపత్రాల కోసం వినతి



ఆర్‌డిఒతో మాట్లాడుతున్న యానాదులు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాలు ఇప్పించాలని ఇందిరమ్మ కాలనీకి చెందిన యానాదులు సోమవారం స్పందనలో ఆర్‌డిఒ పి.శేషశైలజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యానాది సామాజిక తరగతికి చెందిన పిట్ల శ్రీరాములు, పిరిడి రాజేష్, పిట్ల రూప మాట్లాడుతూ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో సంక్షేమ పథకాలకు దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు కూడా చదువుకు దూరమవుతున్నారని వాపోయారు. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న తమ బంధువులకు ఎస్‌టి సర్టిఫికెట్ జారీ చేస్తున్నారని, ఇక్కడ మాత్రం ఇవ్వడం లేదని తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ హామీఇచ్చారు. పిల్లలను పనికి పంపించకుండా బడికి పంపించాలని సూచించారు.

ఇనాం భూములపై హక్కులు కల్పించాలి

తెర్లాం మండలంలోని బూరిపేట పంచాయతీలో ఇనాం భూములు సాగు చేసుకుని 150 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని సర్పంచ్ బూరి మధుసూదనరావు, మాజీ సర్పంచ్ బి.చినప్పలనాయుడు, రైతులు చెప్పారు. వాటికి పట్టాలిప్పించాలని ఆర్‌డిఒను కోరారు. ఇనాం భూములపై హక్కు లేకపోవడంతో రైతు భరోసా రావడం లేదని, ధాన్యం కొనుగోలు చేయడం లేదని వారంతా వాపోయారు. తమ జిరాయితీ భూమి పైనుంచి సాగునీటి కాలువ అక్రమంగా తవ్వేశారని, చర్యలు తీసుకోవాలని దత్తిరాజేరు మండలం వి.కృష్ణాపురానికి చెందిన రైతు రంభ నాగభూషణం స్పందనలో ఫిర్యాదు చేశారు.



ధాన్యం బస్తాలతో ర్యాలీ చేపడుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

రైతు సమస్యలు పట్టించుకోండి

టిడిపి ఆధ్వర్యాన వినూత్న రీతిలో నిరసన

ప్రజాశక్తి-గజపతినగరం

భూ కబ్జాలు, ఇసుక దందాలు పక్కనపెట్టి రైతు సమస్యలను పట్టించుకోవాలని మాజీ ఎమ్మెల్యే కె.ఎ నాయుడు.. స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు హితవుపలికారు. గజపతినగరంలో సోమవారం టిడిపి ఆధ్వర్యాన ధాన్యం బస్తాలతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజపతినగరం, బొండపల్లి మండలాల్లో సుమారు 37 వేల టన్నులకు పైగా ధాన్యం పండిస్తే, 23 వేల టన్నులను మాత్రమే రైతుల వద్ద నుంచి ప్రభుత్వం కొనుగోలు చేయడం దారుణమన్నారు. మిగతా ధాన్యాన్ని ఎవరు కొంటారని ప్రశ్నించారు. రైతులు శ్రమపడి పండించిన ధాన్యం దళారుల పాలవుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. అది కూడా ప్రభుత్వ కనుసన్నల్లోనే జరుగుతుందని ఆగ్రహించారు. అనేక సభల్లోని, ప్రెస్‌మీట్లు పెట్టి మరీ ప్రతి గింజా కొంటామని ఊదరగొట్టిన మాటలు ఏమయ్యాయని నిలదీశారు. ధాన్యం సేకరణలో అధికారులతో తప్పుడు లెక్కలు చెప్పించడం వైసిపి నాయకులకే చెల్లిందని ఎద్దేవాచేశారు. రైతులపై కనీస బాధ్యత లేని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అధికారంలో ఉండే అర్హత కోల్పోయారని చెప్పారు. అనంతరం నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు వినూత్నరీతిలో ధాన్యం బస్తాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బండారు బాలాజీ, టిడిపి మండల అధ్యక్షులు అట్టాడ లక్ష్మునాయుడు, నాయకులు పి.వి.వి.గోపాలరాజు, వై.మైథిలి ప్రియాంక, వేమలి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ ఆస్పత్రిలో రక్త నిల్వల కొరత

ప్రజాశక్తి-గజపతినగరం

గజపతినగరం ప్రాంతీయ ఆస్పత్రిలో రక్త నిల్వల కొరత వెంటాడుతోంది. బ్లడ్ బ్యాంక్ ఉన్నప్పటికీ తగు రక్తనిల్వలు లేకపోవడంతో ప్రసవ సమయంలో రక్తం అత్యవసరమైన గర్భిణులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. రక్త నిల్వలు లేకపోవడంతో అనేక సందర్భాలలో గర్భిణులను జిల్లా కేంద్రంలోని ఘోషా ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారు. అలా రిఫర్ చేసిన గర్భిణులు ప్రాణాపాయ స్థితిలో మార్గం మధ్యలోనే 108 వాహనంలో ప్రసవించిన సంఘటనలు చాలానే ఉన్నాయి. మరోవైపు ఆస్పత్రిలో రోగులకు సహాయం కోసం ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. హెల్ప్‌డెస్క్‌లోని ఆరోగ్యమిత్ర కుమారి.. గర్భిణులు, వారి సహాయకులు సాయం కోసం అడగ్గా సరిగా స్పందించకపోగా, నోటి దురుసుతో వ్యవహరించడంతో వాళ్లు ఇబ్బంది పడ్డ సందర్భాలెన్నో ఉన్నాయి.

జెఎస్‌ఎస్‌పై అవగాహన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బానాది గ్రామంలో సోమవారం జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ మాట్లాడుతూ పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇఒపిఆర్‌డి సిహెచ్. సూర్యనారాయణ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శితోపాటు సిబ్బంది, గ్రామ వాలంటీర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న నాడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.యశోద, ఎపిఎం ఆర్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ పత్రాలు దగ్ధం

ప్రజాశక్తి - వంగర

కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ రాజాం మండలంలో గారా చీపురుపల్లి గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను సోమవారం దగ్ధం చేశారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం శాఖ కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో రాంబాబు, శ్రీనివాసరావు, శంకర్రావు, చిరంజీవి, రవి, కృష్ణారావు, తేజ, ఈశ్వరరావు, మారిబాబు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: రాష్ట్రానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధిక నిధులు కేటాయించిందని చెప్పుకుంటున్న నాయకులు విభజన హామీలు, ప్రత్యేక హోదా ఎక్కడికి పోయిందో చెప్పాలని సిఐటియు జిల్లా నాయకులు కిల్లంపల్లి రామారావు ప్రశ్నించారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రైతులకు ఎరువుల్లో సబ్సిడీ కోత విధించి బిజెపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కార్పొరేట్ల ప్రయోజనం కోసం బడ్జెట్ ప్రవేశపెట్టిందని విమర్శించారు.

సాహిత్యానికి తొలిమెట్టు పద్యం

ప్రజాశక్తి - విజయనగరం కోట

తెలుగు భాషకు, సాహిత్యానికి తొలిమెట్టు పద్యమని తెలుగు భాష సేవా సంఘం అధ్యక్షులు ఆర్‌బి రామానాయుడు అన్నారు. సోమవారం స్థానిక గాజులరాగ నారాయణ పబ్లిక్ స్కూల్లో పద్యం రాగయుక్తంగా అనే కార్యక్రమాన్ని నిర్వహించి పిల్లల్లో పద్యపటనపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ తెలుగు భాషకు పద్యం ఎంతో విలువ తెచ్చి పెడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మొయిద నారాయణరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసిపిది నిరంకుశ పాలన

టిడిపి నియోజకవర్గ నాయకులు గొంప కృష్ణ



ఇదేం కర్మ కార్యక్రమంలో పాల్గొన్న గొంప కృష్ణ, వెంకటరావు

ప్రజాశక్తి-వేపాడ

వైసిపి ప్రభుత్వం నిరంకుశంగా పాలన సాగిస్తోందని టిడిపి నియోజకవర్గ నాయకులు గొంప కృష్ణ ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం మండలంలో ఆకుల సీతంపేటలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యాన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామస్తులకు కృష్ణకు హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రం ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందన్నారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు బనాయించి, బెదిరింపులకు పాల్పడుతోందన్నారు. మూడున్నరేళ్లలో వైసిపి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

'ఎ టాక్ ఆన్ ఎమోషనల్ ఇంటెలిజెన్స్' పై అవగాహన



మాట్లాడుతున్న అజిత్‌కుమార్

ప్రజాశక్తి- డెంకాడ

జొన్నాడ వద్ద గల లెండి ఇంజనీరింగ్ కళాశాల వ్యక్తిత్వ వికాస తరగతులలో భాగంగా విద్యార్థులకు సోమవారం 'ఎ టాక్ ఆన్ ఎమోషనల్ ఇంటిలెజెన్స్' అవగాహన కల్పించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన విశ్వధర్మ మందిరం - మూవ్ ఆన్ ఇండియా వ్యవస్థాపకులు ప్రముఖ ఆధ్యాత్మిక గురువు అజిత్ కుమార్ ఆచార్య పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులలో పఠనాశక్తితో బాటు భావోద్వేగ మేధస్సు కోసం పరిశ్రమించాలన్నారు. అందుకు ఇంజనీరింగ్ విద్యతో బాటు ఇన్నర్ ఇంజినీరింగ్ భావాలను కలిగి వుండాలని సూచించారు. భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తల పెట్టిన ఆత్మ నిర్భర భారత్ వైపు యువత పరిశోధనలు చేయాలని అందుకు కావాల్సిన ముడి సరుకును ఇప్పుడే కళాశాలల స్థాయి లోనే సమకూర్చుకోవాలని పిలుపు నిచ్చారు. తదనంతరం సంస్థ చైర్మన్ పి మధుసూదన రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.రామారెడ్డి అతన్ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు, సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ దుర్గా శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.




కార్యదర్శికి వినతి అందిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

అమ్మఒడి మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి-వేపాడ

అమ్మఒడి పథకం మంజూరు చేయాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం వల్లంపూడి సచివాలయంలో కార్యదర్శి భాగ్యలక్ష్మికి వినతి అందించారు. ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 20 మందిలో ఇద్దరికి తప్ప మిగతా 18 మంది విద్యార్థులకు అమ్మఒడి పథకం అమలు కాలేదని వివరించారు. ఇదే విషయమై ఏడాది కాలంగా అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు అందించినా ప్రయోజనం ఉండటం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో కార్యదర్శి భాగ్యలక్ష్మి స్పందించి, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్‌ని పిలిపి, అమ్మఒడి రాకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. 18 మందికి అమ్మఒడి పథకం వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



పంచాయతీలకు శానిటేషన్ మెటీరియల్ పంపిణీచేస్తున్న ఎంపిపి అప్పలనాయుడు

శానిటేషన్ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం రూరల్

విజయనగరంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద పంచాయతీలకు శానిటేషన్ మెటీరియల్, ఫాగింగ్ మిషన్లను, టాయిలెట్ల క్లీనర్స్‌ను సోమవారం ఎంపిపి మామిడి అప్పలనాయుడు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గంటా వెంకటరావు, ఇఒపిఆర్‌డి తిరుపతిరావు, కార్యదర్శులు అప్పలనాయుడు, రామకృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఐవి బాధితులకు హెపటైటిస్-బి వ్యాక్సిన్

విజయనగరం : జిల్లాలో జాతీయ వైరల్ హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రాం, జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమం ఆధ్వర్యాన జిల్లాలో హెచ్.ఐ.వి/ఎయిడ్స్ బాధితులకు హెపటైటిస్-బి వ్యాక్సిన్ వేస్తున్నట్లు జిల్లా క్షయ నివారణ అధికారిని జె.రామేశ్వరి ప్రభ తెలిపారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఈ కార్యక్రమాన్ని సోమవారం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల ప్రారంభించారు. హెపటైటిస్ -బి నెగిటివ్ వచ్చిన బాధితులకు ఈ వ్యాక్సిన్‌ను ఉచితంగా వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్. అప్పలనాయుడు, నోడల్ అధికారి పి. ఆదిత్య వర్మ తదితరులు పాల్గొన్నారు.

పేర్లు మార్పు కాదు.. పనులు చేయాలి

ప్రజాశక్తి -విజయనగరం కోట

వైఎస్ఆర్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పేర్లు మార్పు కాదు ప్రజా సమస్యలపై అభివృద్ధి పనులు చేపట్టాలని టిడిపి నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్ అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని, టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించాలని కోరుతూ కలెక్టరేట్ గ్రీవెన్సులో వినతి అందజేశారు. కార్యక్రమంలో బొద్దల నర్సింగరావు, కర్రోతు నర్సింగరావు, కంది మురళీనాయుడు, కనకల మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. సోమవారం బొబ్బిలి పట్టణంలోని ఐదో వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ పథకాల అమలుపై ఆరాతీశారు. ప్రతీ గడపలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కుల, మత భేదాలు లేకుండా సంక్షేమ పాలన అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, ఇంటి గోపాలరావు, ఎఎంసి వైస్ చైర్మన్ తెంటు పార్వతి, సిరిపురపు లక్ష్మి, జెసిఎస్ పట్టణ కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

అందుబాటులో ఉంటూ సేవలందించండి

ప్రజాశక్తి - వంగర

సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఎంపిపి ఉత్తరవెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులంతా తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని, రోజుకు మూడుసార్లు బయోమెట్రిక్ వేయాలని, ప్రతిరోజు 3-5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఉద్యోగులు ఫీల్డ్ వర్క్‌కు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు మూమెంట్ రిజిస్టులో తప్పనిసరిగా టైం వేసి, సంతకం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి లోపింటి త్రినాధరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు చదువు ముఖ్యం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

ఆడపిల్లలకు చదువు చాలా ముఖ్యమని విజయనగరం ఎఎస్‌పి అస్మా ఫార్హీనా అన్నారు. స్థానిక గురుకుల పాఠశాలలో పది, ఇంటర్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, మోటివేషన్ క్లాస్‌లను సోమవారం నిర్వహించారు. బాలికలు బాలురతో సమానంగా చదువుల్లో రాణించడంతో పాటు క్రీడాల్లోనూ రాణించాలన్నారు. ఉత్తమ లక్ష్యాలను పెట్టుకుని సాధించేందుకు కృషి చేయాలన్నారు. పబ్లిక్ పరీక్షల్లో ఒత్తిడి లేకుండా పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ ఆఫీసర్ విక్రమాధిత్య, ఎస్ఇబి సిఐ రాజశేఖర్, ఎస్ఐ పి.నాగలక్ష్మి, నెల్లిమర్ల ఎస్ఐ నారాయణరావు, ప్రిన్సిపాల్ ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్ షాపుపై దాడి

30 మద్యం సీసాలు సీజ్

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని గున్నతోటవలసలో బెల్ట్‌షాపుపై ఎస్ఇబి అధికారులు దాడి చేసి అక్రమంగా అమ్ముతున్న 30 మద్యం సీసాలను సీజ్ చేశారు. గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో మహిళా పోలీస్ శాంతికుమారి, వాలంటీర్ సహకారంతో ఎస్ఇబి సిఐ ఆర్.జైభీమ్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడిచేశారు. 30 మద్యం సీసాలను సీజ్ చేశారు. వ్యాపారి ఎం.శంకరరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అక్రమంగా మద్యం, నాటుసారా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జైభీమ్ హెచ్చరించారు. దాడిలో ఎస్ఇబి ఎస్ఐ చిన్నంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.